క్లుప్తంగా

కడెం ఆయకట్టుకు సాగు నీరందించాలి



మాట్లాడుతున్న నాయకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ నుంచి కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాల వరకై నాయసంగి పంటలకు సాగు నీటిని విడదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి నూతన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సకాలంలో ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవడంతో, లీకేజీల రూపంలో వేల క్యూసెక్కుల నీరు గోదావరి పాలయ్యాయని..ఇప్పుడు సాగు నీరివ్వమని చెప్పడం సరికాదన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కడెంకు నీటిని విడుదల చేసి ఆయకట్టుకు సాగు నీరందించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన ఆకు లక్ష్మీ–రాజేశ్వర్ దంపతుల కుమారుడు రిషి (12) ఇటీవల బ్రెయిన్ ట్యూమర్‌తో మృతి చెందాడు. కాగా నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మిత్రబృందం సభ్యులు ఆదివారం బా ధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఎన్ఆర్ఐ సభ్యులు ఉదయ్ కిరణ్, దర్శనం శేఖర్, వన్నెల్ శేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి సన్మానం

భైంసా: మండలంలోని తిమ్మాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బందికి ఆదివారం సన్మానం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షులు చాకెటి దేవన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను శాలువాతో సన్మానించారు. గంగన్న, గడ్డన్న, జనార్దన్, షేక్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. అధికారులు తమ నివేదికలను వెంట తీసుకురావాలని పేర్కొన్నారు.

మొరం పోసి లైనింగ్ మరిచారు



మరమ్మతులకు నోచుకోని కెనాల్

నర్సాపూర్(జి): మండలకేంద్రం శివారులో జులైలో కురిసిన వర్షాలకు కాళేశ్వరం 27వ ప్యాకేజీ కెనాల్‌కు భారీ గండి ఏర్పడింది. నాలుగు నెలలు గడిచినప్పటికీ మొరం పోసి వదిలివేశారు. కానీ ఇప్పటికీ లైనింగ్ (సిమెంట్) పనులు చేపట్టలేదు. సంబంధిత అధికారులు స్పందించి లైనింగ్ పనులు పూర్తి చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టండి..



వర్షాలకు దెబ్బతిన్న దేవుని చెరువు రోడ్డు

నర్సాపూర్(జి): మండలకేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో అడవిలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం ఉన్న విషయం తెలిసిందే. ఈనెల 30న స్వామి వారి కల్యాణం, 31న దేవుని చెరువు జాతర నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ ఆలయంలో వెళ్లే మట్టి రోడ్డు దెబ్బతింది. జాతరకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా మట్టిరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

జనవరి 1న శౌర్య దివస్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కేంద్రంలో జనవరి 1న భీమా కోరేగావ్ 205వ శౌర్య దివస్ నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ అసోసియేషన్ ఉట్నూర్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు జగ్జీవన్, కాంబ్లే ప్రజ్ఞశీల్ తెలిపారు. భీమా కోరేగావ్ అమరవీరులకు నివాళులర్పించేందుకు దళిత, ఆదివాసీలు, బహుజనులు తరలిరావాలని కోరారు. సమావేశంలో స్వామి, బొంకంటి సుభాష్, టిబోతే, అకాశ్, బండి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కోసం గ్రామసభలు

- 2024–25లో గ్రామాల్లో చేపట్టే పనులకు ఆమోదం
- ప్రణాళికలు రూపొందించి తీర్మానం చేస్తున్న వైనం



లోకేశ్వరంలో ఉపాధిహామీ గ్రామసభ (ఫైల్)



పంచగుడి నర్సరీలో పాలిథిన్ సంచుల్లో మట్టి నింపుతున్న కూలీలు

లోకేశ్వరం/నర్సాపూర్(జి): గ్రామాల్లో వలసలను నిరోధించి ప్రజలకు సొంత ఊరిలో పని కల్పించడమే ఉపాధిహామీ పథకం ముఖ్య ఉద్దేశం. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో వచ్చే ఆర్థిక సంవత్సరం 2024–25లో చేపట్టే పనుల గుర్తింపునకు ప్ర క్రియ ప్రారంభమైంది. ఇందుకోసం జిల్లాలోని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

పనుల గుర్తింపునకు గ్రామసభలే కీలకం..

ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులకు తప్పనిసరిగా గ్రామసభ ఆమోదం లభించాలి. గ్రామసభలో పంచాయతీ పరిధిలో ఏయే రకం పనులు చేపడుతారో పాలకవర్గం, ప్రజలు చర్చించుకొని ప్రణాళికలు రూపొందించి తీర్మానాలు చేస్తారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సభల్లో కూలీలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై గ్రామాభివృద్ధి, వ్యక్తిగత పనులతోపాటు రైతులు తమ చేన్లలో పనులు చేపట్టాలని కోరవచ్చు. ఇప్పటికే కొన్ని గ్రామసభల్లో చేపట్టే పనులపై తీ ర్మానాలు చేసి సంబంధితశాఖ అధికారులకు అందజేశారు. గ్రామసభలో ఆమోదం లభించకుండా పనులు చేపట్టేందుకు అవకాశం ఉండదు.

లోకేశ్వరం మండలంలోని 30 గ్రామాల్లో ఇప్పటికే ఉపాధిహామీ గ్రామసభలను నిర్వహించారు. నర్సాపూర్(జి) మండలంలోని నర్సాపూర్(జి), చాక్‌పల్లి, అంజనీతండా, బూర్గుపల్లి(జి), అర్లి(కె), బామ్ని(బి)గ్రామాల్లో ఇటీవల ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు.

ఉపాధిహామీ పథకం సద్వినియోగం చేసుకుంటే కూలీలకు పని దొరకడంతోపాటు గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయి.

వివిధ రకాల పనులు..

ఉపాధిహామీ పథకం కింద 56 రకాల పనులు చేపట్టవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా పంట చేలలో నీటికుంటలు, కందకాల తవ్వకం, ఇంకుడుగుంతల తవ్వకం, పశువుల పాక నిర్మాణం, పశుగ్రాసం పెంపకం, పశువుల నీటితొట్టిల నిర్మాణం, సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువుల తయారీ, పంచాయతీ నర్సరీల నిర్వహణ, పండ్ల తోటల పెంపకం, గట్లపై టేకు చెట్ల పెంపకం, వర్షపు నీటి కాలువలు, బంజరు భూములను సాగు యోగ్యంగా మార్చడం, రహదారులు, మట్టి రోడ్లు, శ్మశానవాటికల అభివృద్ధి, నర్సరీల నిర్వహణ, హరితహారం మొక్కల సంరక్షణ, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్వహణ, చెరువుల నిర్మాణం, పూడికతీత వంటి తదితర పనులను గ్రామసభలో ఆమోదించి ఉపాధిహామీ పథకం కింద చేపడుతారు.

భూమి చదును చేయించుకున్న



గతేడాది నాకున్న నాలుగెకరాల భూమిని చదును కోసం ఉపాధిహామీ గ్రామసభలో దరఖాస్తు చేసుకున్నా. ఈజీఎస్ అధికారులు స్పందించి కూలీల ద్వారా నా భూమిని చదును చేయించి మట్టితో గట్లు పోయించారు. దీంతో నాకు మేలు జరిగింది.

– భూమయ్య, రైతు, సాథ్‌గాం

తీర్మానాల మేరకే పనులు..



గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా కొత్తగా చేపట్టే పనులకు ప్రణాళికలు తయారు చేశాం. ఇందుకు అన్ని గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేసి సర్పంచ్‌ల ద్వారా తీర్మానాలు తీసుకుంటున్నాం. ఈ పథకంతో జాబ్‌కార్డు కల్గిన వారందరికీ పని కల్పిస్తాం. రైతులకు కూడా మేలు జరుగుతుంది.

– జగన్నాథ్, ఏపీవో, లోకేశ్వరం

అల్ఫోర్స్‌లో మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్ష



నిర్మల్ అల్ఫోర్స్‌లో ఒలింపియాడ్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్‌టౌన్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ సేవలు వెలకట్టలేనివని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. ఈనెల 22న శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో ఆదివారం మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రామానుజన్ స్ఫూర్తితో ఈ పరీక్షను ఏటా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు 12,600 మంది హాజరైనట్లు తెలిపారు. ఈనెల 22న కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించడంతోపాటు పరీక్షల్లో ప్ర తిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఇందులో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసాలో..

భైంసాటౌన్: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులకు మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో వివిధ పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు పరీక్షలను విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభం



కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

భైంసా: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా దక్కన్ గ్రామీణబ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరవేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, చాకేటి అశోక్, చాకెటి లస్మన్న, మండల ప్రధాన కార్యదర్శి బండారి అశోక్, నాయకులు రామారావు, ఉంబిరి రమేశ్, సంజీవ్‌రావు, దుబాయ్ శీను, రవి, మొతిరం, గౌతమ్, తదితులున్నారు.

మా ఊళ్లోనే చదువు చెప్పండి



చించాల పాఠశాలలో గదిలో కూర్చొన్న ఆరో తరగతి విద్యార్థులు



చించాలలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)



చించాల జెడ్పీ ఉన్నత పాఠశాల

- చించాలలోని 6,7,8 తరగతులను ఎడ్‌బిడ్ పాఠశాలకు తరలింపు
- నాలుగు కిలోమీటర్లు నడవలేమంటున్న విద్యార్థులు
- ఆగస్టు నుంచి చదువుకు దూరంగా ఉంటూ నిరసన
- సొంత ఊరిలోనే చదువుతామంటున్న బాలలు
- సమస్య పరిష్కరించాలని అధికారులకు గ్రామస్తుల వేడుకోలు

ముథోల్: పేద కుటుంబాలకు చెందిన మాకు మా ఊరిలో ఉన్న సర్కారు బడిలోనే పాఠాలు చెప్పాలని.. నాలుగు కిలోమీటర్లు నడిచి మరో గ్రామమైన ఎడ్‌బిడ్ పాఠశాలకు తాము రాలేమని ముథోల్ మండలంలోని చించాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఆగస్టు నుంచి పాఠాలకు దూరం ఉంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని.. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ముథోల్ మండలం చించాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులున్నా.. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉందని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 9, 10 తరగతుల వారిని పక్కనున్న ఎడ్‌బిడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు తరలించారు. అనంతరం ఆగష్టు వరకు మిగిలిన 6,7,8 తరగతులకు చెందిన 30 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు పాఠాలు బోధించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 6,7,8 తరగతులకు చెందిన 30 మంది విద్యార్థులను కూడా ఎడ్‌బిడ్ పాఠశాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎడ్‌బిడ్ పాఠశాలకు వెళ్లకుండా రోజు చించాల పాఠశాలకే వస్తున్నారు. నలుగురు ఉపాధ్యాయులనూ డెప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపించారు.

నడిచి వెళ్లలేమంటున్న 30మంది విద్యార్థులు

విద్యార్థులు మాత్రం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎడ్‌బిడ్ పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లలేమని.. సొంత ఊరిలోనే తమకు పాఠాలు చెప్పాలని 6, 7, 8 తరగతులకు చెందిన 30 మంది విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇటీవల పీజీ హెచ్ఎం పోస్టు మంజూరైనా వచ్చినప్పటికి బడిని తెరవలేదన్నారు. ఆగస్టు నుంచి చదువుకు దూరమయ్యామని.. పేద విద్యార్థులమైనా తాము రవాణా చార్జీలు భరించలేమని మా ఊరి బడినే తెరిపించి పాఠాలు చెప్పాలని వేడుకుంటున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు..

సమస్య పరిష్కరించాలని ఉన్నతాధికారులకు రెండుసార్లు వినతిపత్రం అందించి.. ఓసారి రాస్తారోకో చేసినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అన్యాయం చేయొద్దని వెంటనే మా ఊరి బడినే తెరిపించి అక్కడే పాఠాలు చెప్పాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, డిమాండ్ చేస్తున్నారు.

బస్సు సౌకర్యం లేదు



నేను చించాల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నా. మేం ఎడ్‌బిడ్ పాఠశాలకు వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడవాలి. సమయానికి బస్సు రాదు. మేం చించాల పాఠశాలలోనే చదువుకుంటాం.

– గంగాచరణ్, ఆరోతరగతి విద్యార్థి

రోజు రూ.40 కావాలి



రోజు ఎడ్‌బిడ్ పాఠశాలకు వెళ్లి చదువుకోవాలంటే రవాణా చార్జీలు రూ.40 కావాలి. వీటిని భరించే స్థోమత మాకు లేదు. మా చించాలలో పాఠశాల నడిపిస్తే మేము బడికి వెళ్లి చదువుకుంటాం. అధికారులు స్పందించి చించాలలో పాఠశాలను తెరవాలి.

– హర్షవర్ధన్, ఆరోతరగతి విద్యార్థి

రవాణా చార్జీలు భరిస్తాం

చించాల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటంతో ఎడ్‌బిడ్ పాఠశాలకు తరగతులను తరలించాం. అవసరమైతే విద్యార్థుల రవాణా చార్జీలు భరిస్తాం. సమయానికి బస్సు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. యూడైస్‌కి సంబంధం లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి చించాలలో తిరిగి యథావిధిగా తరగతులను ప్రారంభిస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

ఆధ్యాత్మికం

ధర్మారంలో భక్తుల పూజలు



ఆలయం వద్ద భక్తుల సందడి

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో ఉన్న మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోర్కెలు తీర్చాలని అమ్మవారిని వేడుకున్నారు. దీంతో ఆలయప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

గజ్జలమ్మ ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ పల్లకిసేవ నిర్వహించారు. జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

గంజాల్‌లో ఆలయ వార్షికోత్సవం



సోన్: గంజాల్‌లో పాల్గొన్న భక్తులు

సోన్: మండలంలోని గంజాల్ గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరమహంస పరివ్రజక బాలయోగి రాములు మహరాజ్ ఆధ్వర్యంలో ఉదయం మంగళహారతి, పుణ్యాహవచనం, గరుడ కల్యాణం, స్వామి వారి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ గంగయ్య, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ ఫక్రుద్దీన్, వీడీసీ సభ్యులు, భజన మండలి సభ్యులు, వార్డు సభ్యులు ముత్తన్న, లింగన్న, గంగారెడ్డి, అశోక్, నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు



తిరుప్పావై ప్రవచనాలు వింటున్న భక్తులు



మామడ: పొన్కల్ వేంకటేశ్వరాలయంలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన దేవరకోట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకోగా వారికి తీర్థప్రసాదం అందజేశారు. ఉదయం 6:30 గంటలకు భక్తులకు తిరుప్పావై ప్రవచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ఇన్‌చార్జి ఈవో రవికిషన్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

మామడ: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా మండలంలోని పొన్కల్, మామడ, కొరిటికల్ గ్రామాల్లో శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహిళలు మంగళహారతులతో ఆలయానికి తరలివచ్చారు. పొన్కల్ ఆలయంలో అర్చకులు విజయస్వామి ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

ముగిసిన మల్లన్న దేవుడి ప్రతిష్ఠాపన



రూ.50వేల విరాళం ఇస్తున్న వీడీసీ సభ్యులు

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న మల్లన్న దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం ప్రతిష్ఠాపన ఉత్సవాలు వేదపండితుల ఆధ్వర్యంలో జరిపించారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి బోనాల జాతర నిర్వహించగా మహిళలు బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. ఈసందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి రూ.50వేలను విరాళంగా యాదవ సంఘం సభ్యులకు అందించారు. కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు దావ మల్లయ్య, బండి మహేందర్, దావా సాగర్, దేవనబోయిన మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆరట్టు



స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ శ్రీ ధర్మశాస్త అయ్యప్ప ఆలయంలో ఆదివారం ఆరట్టు ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. గురుస్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. భక్తుల సంకీర్తనల నడుమ సోన్ సమీపంలోని గోదావరి తీరానికి వెళ్లి నదిలో స్వామివారికి జలం, పంచామృతాలతో అభిషేకం చేశారు. తిరిగి ఆలయానికి వెళ్లి ఉజ్జల్‌సేవ కార్యక్రమం అనంతరం అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు అధిక సఖ్యలో పాల్గొన్నారు.

గుంత పూడ్చి బోర్డు తొలగించరూ..



గుంత తెలిసేలా ఏర్పాటు చేసిన బోర్డు

తానూరు: మండలంలోని హిప్నెల్లి తండా గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన వద్ద రోడ్డుపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ గుంత తెలిసేలా రోడ్డుపై బోర్డు ఏర్పాటు చేశారు. ఏడాది కిందట గుంత ఏర్పడినా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదని.. ఇప్పటికైనా సమస్య పరిష్కరించి రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.